విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

# తెలుగు గళం

E69 NEWS

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :311 మంగళవారం 20 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!




ఎనిమిది మంది ముఠా సభ్యుల అరెస్ట్
రూ.3.71 కోట్ల అక్రమ నగదు ఫ్రీజ్
రూ.1.5 కోట్ల స్మాక్ స్వాధీనం
ఫరీదాబాద్ కేంద్రంగా డ్రగ్స్ దందా
విద్యార్థులు, యువతే ముఠా టార్గెట్
డ్రగ్స్ రవాణా వాహనాలు సీజ్

## ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!

ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీ
భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
ఐదుగురు మంత్రులకు సభ్యులుగా అవకాశం
సీఎం సలహాదారుకు ప్రత్యేక ఆహ్వానం
కరువు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
శాఖలకు మార్గదర్శకాలు జారీ చేయనున్న కమిటీ
కేంద్రానికి నివేదికలు.. ప్రభుత్వానికి సిఫార్సులు




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్?గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతకక్, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:

ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

## పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!

హైదరాబాద్‌లో 75 మంది ఎస్సైల బదిలీ
ఎస్సైల బదిలీలతో పోలీస్ శాఖలో కుదుపు
ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సజ్జనార్
పలు విభాగాలకు ఎస్సైల మార్పు
లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై ఫోకస్
వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఆదేశం
నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

2 లో

## తమిళనాడులో మరో కొత్త పార్టీ!

తమిళనాడులో కొత్త పార్టీకి అన్నామలై సిద్ధం
త్వరలోనే సొంత పార్టీ ప్రకటన
బీజేపీ అధ్యక్ష పదవికి గతంలో రాజీనామా
'వి ది లీడర్స్'తో సామాజిక ఉద్యమం
డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంపై ప్రత్యేక దృష్టి
పర్యావరణ పరిరక్షణకు విస్తృత కార్యక్రమాలు
స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల బరిలోకి
తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఆసక్తి




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు.

రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!

రాచమల్లు వ్యాఖ్యలతో ఏపీలో దుమారం
టీడీపీ రూ.2 వేలు.. వైసీపీ రూ.2 వేలు
ఏకగ్రీవాలతో నగదు అందడం లేదంటూ వ్యాఖ్యలు
ఇంట్లో నలుగురు ఓటర్లకు రూ.16 వేల ఆశ
ప్రజలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్
రాచమల్లుపై చర్యలకు కూటమి నేతల డిమాండ్

2 లో

## గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!

ముస్లింలు ఎవరికీ బానిసలు కారు
మన సమాజం నుంచే నాయకులు రావాలి
ఇతర పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదు
ముస్లింలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నారు
యువతకు రాజకీయ వేదిక కల్పించాలి
సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపు
ఒవైసీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

2 లో



## కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రవహిస్తున్న గోదావరి నీటిని పరిశీలించిన ఆమె.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందించే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కరువు పరిస్థితుల్లోనూ నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మిగతాది 2 లో..

- రైతులకు నీరివ్వకుంటే సహించేది లేదు!
- రేవంత్ సర్కారుకు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- కరువులోనూ గోదావరి నీరు..ఎందుకు ఎత్తిపోయరు?
- 93 మీటర్ల కాపర్ డ్యామ్ నిర్మించండి
- మేడిగడ్డతో పనిలేకుండా నీటిని లిఫ్ట్ చేయొచ్చు
- సాగునీటిపై నిర్లక్ష్యం.. రైతులకు అన్యాయం
- కాళేశ్వరంపై మరో రూ.50 వేల కోట్లు
- తుపాకులగూడెం నుంచే అనుసంధానం
- రైతుల కోసం పోరాటం ఆగదు..

## ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల సమయంలో కొన్ని ఘటనలు జరిగినా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,942 వార్డు స్థానాలకు 24,451 నామినేషన్లు అందాయి. మేయర్, చైర్‌పర్సన్ పదవులకు కలిపి 1,358 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 18న నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తమ నామినేషన్లను సమర్పించారు. ఇక, చివరి రోజైన అక్టోబర్ 18న ఒక్కరోజే మేయర్, చైర్‌పర్సన్ పదవులకు 1,009 నామినేషన్లు దాఖలయ్యాయి.



దసరా పర్వదిన సందర్భంగా
నేడు మా కార్యాలయానికి సెలవు
కావున రేపటి సంచిక వెలువడదు
పునః దర్శనం తిరిగి గురువారం
(22-10-2026)
-ఎడిటర్

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!

మదీనా క్రాస్‌రోడ్డులో చెలరేగిన మంటలు
బట్టల గోడౌన్‌లో ఒక్కసారిగా అగ్నికీలలు
దట్టమైన పొగలతో స్థానికుల్లో భయాందోళనలు
ఐదు ఫైరింజన్లతో మంటల అదుపునకు యత్నం
ఘటనతో రహదారిపై ట్రాఫిక్ అంతరాయం
ఆస్తి నష్టంపై అధికారుల ఆరా




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది.

## సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!




మెజిస్ట్రేట్‌కు హత్య బెదిరింపు మెసేజ్
సీజేపీ నేతల బెయిల్‌పై ఉత్కంఠ
బెదిరింపులపై ఢిల్లీ పోలీసుల దర్యాప్తు
బెయిల్ అడ్డుకునేందుకే కుట్ర: సీజేపీ
విచారణకు ఆలస్యం చేశారని ఆరోపణలు
సాయంత్రం వరకు కోర్టుకు రాలేదని విమర్శ
నాలుగు రోజుల తర్వాత ప్రాసిక్యూటర్ హాజరు

# ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!

మొదటి పేజీ తరువాయి



అదే రోజు వార్డు సభ్యుల స్థానాలకు ఏకంగా 16,282 నామినేషన్లు అందాయి. దీంతో చివరి రోజు నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడి నెలకొంది.

కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 320 నామినేషన్లు దాఖలు కాగా, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చైర్‌పర్సన్ పదవులకు 1,038 నామినేషన్లు వచ్చాయి. వార్డు స్థానాల విషయానికి వస్తే, కార్పొరేషన్లలో 8,198 నామినేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 16,253 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక, మేయర్, చైర్‌పర్సన్ పదవులకు పార్టీలవారీగా వచ్చిన నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 367, తెలుగుదేశం పార్టీ నుంచి 329, కాంగ్రెస్ నుంచి 117, జనసేన నుంచి 100 నామినేషన్లు అందాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 287, ఇతర పార్టీల నుంచి 158 నామినేషన్లు దాఖలయ్యాయి.

వార్డు సభ్యుల స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి అత్యధికంగా 9,460 నామినేషన్లు వచ్చినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి 8,175, జనసేన నుంచి 2,324, కాంగ్రెస్ నుంచి 416 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2,586, ఇతర పార్టీల నుంచి 1,490 నామినేషన్లు అందాయి. ఇదిలా ఉండగా, కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. కడప జిల్లా కలెక్టర్ నుంచి అందిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మైదుకూరు ఎన్నికలపై తదుపరి చర్యలు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కొనసాగనున్నాయి.

# పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!



GOVERNMENT OF TELANGANA
(POLICE DEPARTMENT)

Office of the Commissioner of Police Hyderabad City.

ORDER

**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దసర పండుగల వేళ పోలీసు శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అడ్మినిస్ట్రేటివ్ పనితీరును మరింత వేగవంతం చేయడంలో భాగంగా భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 75 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.

నగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత కట్టుదిట్టం చేసేందుకు, అలాగే సుదీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని వేర్వేరు స్టేషన్లు, విభాగాలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లకు బదిలీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బదిలీ అయిన స్థానాల్లో అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాబోయే పండుగలు, నగరంలో పెరుగుతున్న రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లుగా పోలీస్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఒకేసారి 75 మంది ఎస్సైలు బదిలీ కావడం పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజకీయాల్లో ముస్లింలు ఎవరికీ బానిసలు కాదని, సంప్రదాయ పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదని ఆలిండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. తాజాగా ఉత్తర్ ప్రదేశ్‌లోని రాంపూర్ లో ఆయన మాట్లాడుతూ.. తమకు నెహ్రూ, గాంధీ , యాదవ్ కుటుంబాల నాయకత్వం ఇకపై అవసరం లేదని, తమ సమాజం నుంచి స్వయంగా నాయకులు ఎదుగుతారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంకెన్నాళ్లు ఇతర పార్టీల నాయకుల వెనుక తిరుగుతూ, వారిని నెహ్రూలు, గాంధీలుగా భావించి మద్దతు ఇవ్వాలని కొందరు మనవారే చెబుతున్నారని కామెంట్ చేశారు. 'అలాంటి వారికి, ఒవైసీకి తేడా ఇదే; వాళ్లు ఇతరులను సమర్థించమంటారు, కానీ నేను మాత్రం మీరే నాయకులు కండి అంటాను' అని అసదుద్దీన్ ఒవైసీ తేల్చిచెప్పారు.

ముస్లిం యువతీ యువకులకు ఇతర వర్గాలవారితో సమానంగా అపారమైన సామర్థ్యం, ప్రతిభ ఉందని, అయితే ప్రధాన రాజకీయ పార్టీలు వారిని కేవలం ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయే తప్ప సరైన వేదిక కల్పించడం లేదని అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అణగారిన వర్గాల గొంతు వినిపించేందుకు, ముస్లిం యువతకు రాజకీయ వేదికను అందించేందుకే తమ పార్టీ నిరంతరం పనిచేస్తూనే ఉందని పేర్కొన్నారు. యువత ఎవరిపై ఆధారపడకుండా తమ సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అయితే, దేశంలోని ప్రధాన పార్టీల తీరును ఎండగడుతూ ఒవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌ల బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కి హత్య బెదిరింపులు రావడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మెజిస్ట్రేట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు అపరిచిత వ్యక్తులపై నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కావాలనే ఆలస్యం చేస్తున్నారు: సీజేపీ తీవ్ర ఆరోపణలు

మెజిస్ట్రేట్‌కు వచ్చిన బెదిరింపుల నెపంతో విచారణను కావాలని పక్కదోవ పట్టించారని, తమ నేతలకు బెయిల్ రాకుండా నిరోధిస్తున్నారని సీజేపీ తీవ్రంగా మండిపడింది. ఈ పరిణామంపై సీజేపీ లీగల్ సెల్ చీఫ్ రత్నా సింగ్ స్పందిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము ఉదయం నుంచే కోర్టు వద్ద వేచి చూస్తున్నామని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు విచారణ జరుగుతుందని చెప్పారని పేర్కొన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియతో సహా అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని.. కానీ మెజిస్ట్రేట్ సాయంత్రం 5 గంటల వరకు కోర్టు రూమ్‌లోకి రాలేదని ఆరోపించారు. బెయిల్ పిటిషన్ మెరిట్స్ ఆధారంగా విచారించకుండా, కేవలం ఆ బెదిరింపు మెసేజ్ చుట్టూనే చర్చను తిప్పారని రత్నా సింగ్ ఆరోపించారు. గత 4 రోజులుగా రాని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమవారం అకస్మాత్తుగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే మెజిస్ట్రేట్ బెదిరింపుల అంశాన్ని తేవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. తమ నేతల విడుదలను అడ్డుకోవడానికే ఇదంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందని ఆమె విమర్శించారు.

కాగా, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపారనే ఆరోపణలతో అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను ఢిల్లీ పోలీసులు గత వారం అరెస్ట్ చేసి, 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. వారి బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, విచారణ ప్రారంభమైన ఐదు నిమిషాలకే తనకు చంపేస్తామంటూ ఓ మెసేజ్ వచ్చిందని మెజిస్ట్రేట్ కోర్టులో స్వయంగా వెల్లడించడం హాట్ టాపిక్‌గా మారింది.

# ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీలో నార్కోటిక్స్ డ్రగ్స్ సప్లై నెట్‌వర్క్‌పై సౌత్-ఈస్ట్ జిల్లా పోలీసులు భారీ మెరుపు దాడి నిర్వహించి అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టును రట్టు చేశారు. ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్ నం. 225/2026 కేసు దర్యాప్తులో పోలీసులకు సంచలన పురోగతి లభించింది. ఈ డ్రగ్స్ దందా ద్వారా అక్రమంగా ఆర్జించిన సుమారు రూ. 3,71,98,560 నగదు నిల్వలను చట్టపరమైన ఉత్తర్వుల ద్వారా ఢిల్లీ పోలీసులు విజయవంతంగా ఫ్రీజ్ చేయించారు. తొలుత స్థానిక పెడ్లర్లను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నెట్‌వర్క్ వెనుక హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కీలక సరఫరాదారులు, భారీ స్టాకిస్టులు, మధ్యవర్తుల లింకులు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఠా సభ్యుల నుంచి మార్కెట్లో సుమారు రూ. 1.5 కోట్ల విలువైన 1.383 కిలోల స్వచ్ఛమైన 'స్మాక్' మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో సమగ్ర దర్యాప్తు అనంతరం పోలీసులు మొత్తం ఎనిమిది మంది ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కిరణ్ అలియాస్ రామ్ ప్రసాద్, నీరజ్ అలియాస్ థాపా, అశోక్ అలియాస్ రాము, మనియా అలియాస్ సుమన్ పాఠక్, విక్కీ, గుడ్డు, సునీత్ అలియాస్ నన్హే మరియు గోపీ సింగ్‌లుగా అధికారులు గుర్తించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాలను సీజ్ చేయడంతో పాటు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న ఇతర కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి.

# ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ స్థానిక ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయిస్తోందని, దీని వల్ల సామాన్య ప్రజలకు ఎన్నికల సమయంలో అందాల్సిన డబ్బులు దక్కకుండా పోతున్నాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రొద్దుటూరులో మీడియాతో మాట్లాడిన ఆయన.. సాధారణంగా ఎన్నికలు జరిగితే అధికార టీడీపీ రూ. 2 వేలు, తాము (వైసీపీ) రూ. 2 వేలు ఓటర్లకు పంచేవారమని నిస్సంకోచంగా వ్యాఖ్యానించారు. ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే పండుగ పూట కనీసం రూ. 16 వేల వరకు నగదు వస్తుందని సామాన్య ప్రజలు ఆశగా ఎదురుచూశారని, కానీ ఏకగ్రీవాల పేరుతో ఆ అవకాశాన్ని లేకుండా చేశారని చెప్పడం తీవ్ర దుమారం రేపుతోంది.

అలాగే ప్రజలకు చేరవలసిన ఆ డబ్బులను కూటమి ప్రభుత్వమే నేరుగా అందించాలని రాచమల్లు డిమాండ్ చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవాలు చేసుకున్నందుకు గాను, తామిచ్చే రూ. 2 వేలు, టీడీపీ ఇచ్చే రూ. 2 వేలు కలిపి మొత్తం రూ. 4 వేలను టీడీపీ నేతలే ప్రజల ఇళ్లకు వెళ్లి చెల్లించాలని చెప్పడం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపిణీని బాహాటంగా సమర్థిస్తూ, పరోక్షంగా ఓట్లకు నోట్ల సంస్కృతిని ప్రస్తావిస్తూ ఓ మాజీ ప్రజా ప్రతినిధి బహిరంగంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాచమల్లు చేసిన ఈ వ్యాఖ్యలపై అధికార కూటమి నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేలా మాట్లాడినందుకు ఆయనపై ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కిలావుయా 55వ విస్ఫోటనం!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** అమెరికాలోని హవాయి ద్వీపంలోని క్రియాశీల అగ్నిపర్వత్వం కిలావుయా మరోసారి విస్ఫోటనం చెందింది. అక్టోబర్ 17న జరిగిన విస్ఫోటనంలో లావా ఫౌంటెన్లు ఎగిసిపడ్డాయి. సుమారు 700 అడుగుల ఎత్తు వరకు లావా ఎగిసిపడింది. 2024 డిసెంబర్ నుంచి గత 22 నెలల వ్యవధిలో ఇది 55వ సారి విస్ఫోటనం చెందడం.

హవాయిలోని వోల్కనోస్ నేషనల్ పార్క్‌లో ఉన్న కిలావుయా అగ్నిపర్వతం ఉత్తర బిలం వద్ద స్థానిక కాలమానం ప్రకారం.. తెల్లవారుజామున 3.19 గంటలకు లావా బయటకు రావడం ప్రారంభమైంది. ఉదయం 5 గంటల సమయానికి బయటకు రావడం తీవ్రమైంది. ఈ ప్రక్రియ సుమారు 6 గంటల పాటు కొనసాగి ఉదయం 9 గంటలకు ముగిసింది. అగ్నిపర్వతం పేలుడు ధాటికి ఎగిసిపడిన బూడిద మేఘం సుమారు 25,000 అడుగుల ఎత్తుకు చేరింది.

చివరిసారిగా దాదాపు 2 నెలల క్రితం మళ్లీ కిలావుయా విస్ఫోటనం చెందింది. చివరిసారిగా ఆగస్టు 25న ఇది జరిగింది. తాజా విస్ఫోటనం మొత్తం హాలేమా ఉమాఉ అగ్ని పర్వత బిలానికి మాత్రమే పరిమితం కావడంతో చుట్టుపక్కట ప్రాంతాలకు పెద్దగా ప్రమాదం జరగలేదు. కిలావుయా ప్రపంచంలో క్రియాశీలకంగా ఉన్న అగ్నిపర్వతాల్లోఒకటి.

# ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్ గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతకక్, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:

ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

# తమిళనాడులో మరో కొత్త పార్టీ!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు. రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన సర్వీస్‌కు రాజీనామా చేసిన అనంతరం ఆయన బీజేపీలో చేరి, తమిళనాడులో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. అయితే ఇటీవల పార్టీ పదవిని వీడిన ఆయన, ప్రస్తుతం ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'వి ది లీడర్స్' పేరుతో ఒక నూతన సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం ఈ ఉద్యమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జనహిత కార్యక్రమాలను ఆయన ముందుకు తీసుకువెళుతున్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై ఆయన బృందం విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'వి ది లీడర్స్' వేదిక తరపున అభ్యర్థులను బరిలోకి దించి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

అన్నామలై తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం తమిళనాడు రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ద్రవిడ పార్టీల ఆధిపత్యం ఉండే తమిళ రాజకీయాల్లో ఒక మాజీ ఐపీఎస్ అధికారి, ప్రజా ఉద్యమాల ద్వారా సొంత పార్టీని స్థాపించి ముందుకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కాలంలో ఆయన పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో పెద్ద మొత్తంలో దుస్తులు, ఇతర వస్తువులు ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించి భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్ముకోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పండుగ సమయంలో వ్యాపార కార్యకలాపాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది ఐదు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న వస్తువులు మంటలకు ఆహుతయ్యే అవకాశం ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఏంటన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు, అగ్నిప్రమాదాన్ని చూసేందుకు స్థానికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో ఎంత మేర ఆస్తి నష్టం జరగ్గా.. పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం జరిగిందా లేదా అన్న విషయంపై కూడా అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

మొదటి పేజీ తరువాయి



కరువు కాలంలోనూ సుమారు 2 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని కవిత పేర్కొన్నారు. 93 మీటర్ల పొడవునా కాపర్ డ్యామ్ నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పరిశీలించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానని, వెంటనే కాపర్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పట్టించుకోకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతులకు విద్యుత్తు సరఫరా చేయకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసి సాగుకు వినియోగించకుండా నష్టం కలిగిస్తే సహించబోమని కవిత స్పష్టం చేశారు. రైతాంగ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సంపూర్ణ మేలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడిందని కవిత తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై రూ.93 వేల కోట్లు ఖర్చు చేశారని, ఆయకట్టు లక్ష్యాన్ని పూర్తిగా సాధించేందుకు మరో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ఆమె పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరు ప్రజలకు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. అయితే, ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు లక్ష్యాలు, అదనపు నిధుల అవసరంపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకురాలిగా ఆమె వెల్లడించిన వివరాలుగా పరిగణించాలి.

గోదావరి-కావేరి నదుల అనుసంధానంపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అనుసంధానాన్ని పోలవరం నుంచి చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. విజయవాడలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తోనూ ఈ అంశంపై చర్చించినట్లు గుర్తుచేశారు. అయితే, తుపాకులగూడెం నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపడితేనే తెలంగాణకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కవిత అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం నీటి వినియోగం, కాపర్ డ్యామ్ నిర్మాణం, నదుల అనుసంధానంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధ పూజ

- ప్రజల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం:-ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్
- పోలీసు సిబ్బంది క్షేమం.. ప్రజల శాంతి కోసం ప్రత్యేక పూజలు
- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ

తెలుగు గళం ములుగు, అక్టోబర్ 19:

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఆయురారోగ్యాలతో ఉండాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ప్రజలందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ భట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ఐలు స్వామి, తిరుపతి, వెంకటనారాయణ, శ్రీకాంత్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెంకటాపురం ఎస్ఐ చల్లా రాజు, ఎస్ఐలు తాజుద్దీన్, కృష్ణ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# దసరా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం, అక్టోబర్ 19:



దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 14వ వార్డులో దసరా రోజు జరిగే భారీ రావణ దహన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించడానికి డిసిపి రాజమహేంద్ర నాయక్ మరియు సిఐ శ్రీనివాస్, ఎస్సై రాజేష్ క్రీడ ప్రాంగణాన్ని పరిశీలించి దసరా ఉత్సవంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని సూచనలు సలహాలు ఇచ్చారు. 14 వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య మాట్లాడుతూ రేపు జరగబోయే రావణవద కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారని సంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలుపుతూ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు .ఈ కార్యక్రమంలో కిషోర్ చారి, గజ్జల రాజు, గడ్డాల శేఖర్, రాజారపు ఏలియా, అక్కపెల్లి శీను, పొన్నాల స్వామి, మామిడాల శ్రీనివాస్, కొండ రవి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల నిరాధార ఆరోపణలను తిప్పికొట్టిన కాంగ్రెస్ నాయకులు"

- 30 ఏళ్లుగా ఆనవాయితీ ప్రకారమే లిఫ్ట్ నిర్వహణ రుసుము సేకరణ"
- మంత్రులు తుమ్మల, ఎమ్మెల్యే మట్టా రాగమయి సహకారంతో రైతులకు నిరంతరాయంగా సాగునీరు"

సత్తుపల్లి/వేంసూరు, అక్టోబర్ 19(తెలుగుగళం)న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలానికి చెందిన లిఫ్ట్-1, లిఫ్ట్-2లకు సంబంధించి బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను స్థానిక కాంగ్రెస్ నాయకులు, లిఫ్ట్ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. రైతుల భాగస్వామ్యంతో లిఫ్ట్ ప్రారంభమైన నాటి నుంచి, గతంలో పనిచేసిన చైర్మన్ల కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం లిఫ్ట్‌ల నిర్వహణ (మెయింటెనెన్స్) కోసం గత 30 సంవత్సరాలుగా రైతుల నుంచి నామమాత్రపు రుసుము మాత్రమే వసూలు చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు. గతంలో పనిచేసిన కొందరు చైర్మన్ల నిర్లక్ష్యం కారణంగానే మరమ్మతులు అధికమై, సొంతంగా రిపేర్లు చేయించి లిఫ్ట్‌లను సమర్థవంతంగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను దాచిపెట్టి, కొందరు బీఆర్ఎస్ నాయకులు రాజకీయ దురుద్దేశంతో రైతులను తప్పుదోవ పట్టిస్తూ, రెచ్చగొట్టేలా తప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సీరియల్ పద్ధతిలో సాగునీరు అందిస్తూ, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంటలను కాపాడుతున్నామని నాయకులు తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గార్ల ప్రత్యేక సహకారంతో రైతులకు లిఫ్ట్‌ల ద్వారా సాగునీటిని నిరాటంకంగా అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో: జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు-1 ప్రతినిధి కనపతరెడ్డి రంగారెడ్డి, వేంసూరు-2 ప్రతినిధి షేక్ జాకీర్, కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఎండీ. ఫక్రుద్దీన్, మేడా వెంకటేశ్వరరావు,జి.శ్రీనివాసరావు,మల్లెల్లి నరసింహస్వామి, దండి చెన్నారావు, షేక్ మొహిద్దిన్,మహ్మద్ అక్బర్, కర్రి నాగేశ్వరరావు,ఈడా పిచ్చయ్య, దానే శ్రీను, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ములుగు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కమిటీ ప్రకటన

నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మారం సుమన్ రెడ్డి
యువ నాయకులతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



తెలుగు గళం ములుగు, అక్టోబర్ 19:

ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ములుగు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మారం సుమన్ రెడ్డి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా అంగోతు వంశీ, హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మల్లెల రణధీర్, ప్రధాన కార్యదర్శులుగా జంగం భానుచందర్, కాసర్ల రాజు, కార్యదర్శులుగా కృణదీపక్, బండి రమేష్, అన్వేష్ ఎంపికయ్యారు. అధికార ప్రతినిధులుగా పాక భాస్కర్, బొమ్మగాని ప్రభు, ప్రచార కార్యదర్శిగా నాలి అనిల్ కుమార్, కోశాధికారులుగా ఘంటా సాయి రెడ్డి, చంటి, కమిటీ సభ్యులుగా బరిగల నరేష్, రేగా సాగర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువజన కాంగ్రెస్ నాయకులు పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయదశమి సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ

జమాల్ పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/అక్టోబర్ 19



విజయదశమి పండుగను పురస్కరించుకుని జమాల్ పురం గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు.గ్రామ అభివృద్ధిలో, పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించి, వారిని గౌరవించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన చిన్న కార్యక్రమంలో ముగ్గురు సిబ్బందికి ప్యాంట్, షర్ట్ పీసులు, టవల్స్ తో కూడిన బట్టలను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర మరువలేనిదని,పండుగ రోజున వారి కుటుంబాల్లో కూడా ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఈ చిన్న కానుక అందజేస్తున్నానని అన్నారు.సర్పంచ్ చేతుల మీదుగా బట్టలు అందుకున్న సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్ భరోసా!

- సిబ్బంది అవసరాలకు ఉచితంగా వస్తువుల అందజేత
- సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

: సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్

తెలుగు గళం వాజేడు, అక్టోబర్ 19:



ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ సిబ్బందికి అవసరమైన వస్తువులను సోమవారం గ్రామ సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ ఉచితంగా అందజేశారు. సిబ్బంది అవసరాలను గుర్తించి సహాయం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కరోబార్ కొండయ్య, భాస్కర్, రఘుపతి, శివాజీ, వార్డు సభ్యురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్‌లో అత్యాధునిక ఎస్పీఎం షెడ్ ప్రారంభం

- ప్రారంభించిన టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు టి. మధుసూదన్, వి. మోహన్‌రావు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 19

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక డిపార్ట్‌మెంటల్ ఎస్పీఎం షెడ్‌ను సంస్థ డైరెక్టర్లు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన ఎస్పీఎం షెడ్ అందుబాటులోకి రావడంతో స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, అత్యవసర మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పనులను మరింత వేగంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఉద్యోగులకు విధి నిర్వహణలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యుత్ సేవలను మరింత పటిష్టం చేయడంలో ఈ షెడ్ కీలకంగా నిలుస్తుందని వెల్లడించారు.అనంతరం నూతన షెడ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు, విద్యుత్ సామగ్రిని డైరెక్టర్లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సీఈ (ఆపరేషన్స్-2) సురేందర్, జనగామ ఎస్ఈ (ఆపరేషన్స్) చెరుకు సంపత్‌రెడ్డి, డీఈలు విజయ్‌కుమార్, బి. సారయ్య, అనిల్‌కుమార్, ఈఈ (సివిల్) అనూప్‌కుమార్, ఏడీఈలు బి. శ్రీధర్, పి. రణధీర్‌రెడ్డి, ముంతాజ్ హుస్సేన్, ఏఈలు సుమన్, శంకర్, రణధీర్‌తో పాటు స్టేషన్ ఘన్‌పూర్ విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్ 14వ వార్డులో దసరా సందడి.. రావణ దహనానికి సర్వం సిద్ధం!



మంగళవారం భారీ వేడుకలు.. ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా ప్రదర్శన
విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లపై అధికారుల దృష్టి

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్ అక్టోబర్ 19

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని 14వ వార్డు క్రీడా ప్రాంగణం రావణ దహన వేడుకలకు ముస్తాబవుతోంది. దసరా పండుగను పురస్కరించుకొని దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న భారీ రావణ దహన కార్యక్రమానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలను తిలకించేందుకు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రాంగణంలో అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.కార్యక్రమం సజావుగా సాగేందుకు విద్యుత్ శాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు.ఎన్‌పీడీసీఎల్ స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ సహాయ ఇంజినీర్ పి. శంకర్ ప్రజాప్రతినిధులతో కలిసి వేడుకల ప్రాంగణాన్ని పరిశీలించారు. రావణ దహనం సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన దీపాల ఏర్పాట్లు చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య మాట్లాడుతూ, ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న రావణ దహన వేడుకలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో ప్రజలను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, రంగురంగుల బాణసంచా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.పట్టణ ప్రజలు, యువత, కుటుంబ సమేతంగా వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి పోశాల కృష్ణ, టౌన్ లైన్‌మన్ వాసం శ్రీధర్, ఏఎల్ఎం నాగరాజు, ఎల్. రాజు, శేఖర్, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కిషోర్ చారి, గజ్జల రాజు, గడ్డల శేఖర్, రాజారపు ఏలియా, అక్కపెల్లి శీను, పొన్నాల స్వామి, మామిడాల శ్రీనివాస్, కొండ రవి, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కందకట్ల పుష్ప మృతికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు నివాళి

- పుష్ప కుటుంబానికి అండగా ఉంటామని భరోసా..
- కుటుంబ సభ్యులకు పరామర్శ





**తెలుగు గళం ఏటూరునాగారం అక్టోబర్ 19:**

ఏటూరునాగారం మండలకేంద్రంలోని కందకట్ల వేణు, శ్రీనుల మాతృమూర్తి కందకట్ల పుష్ప గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే పుష్ప నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాతృమూర్తిని కోల్పోయి విషాదంలో ఉన్న వేణు, శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పుష్ప మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, కాకులమర్రి ప్రదీప్ రావు, ఎండీ వలీ బాబా, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, దడిగల సమ్మయ్య, సప్పిడి రామ్ నర్సయ్య, బాస పుల్లయ్య, జాడి బోజరావు, కాళ్ల రామకృష్ణ, బాస శరత్, బట్టు రమేష్, కొండాయి చిన్ని, ఎస్.కె. బాబా, ఎర్రల సారయ్య తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

# ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని
# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- భద్రాచలం ఐటీడీఏ పీఓపై కఠిన చర్యలు తీసుకోవాలి
- హైడ్రా తరహాలో ఏజెన్సీలో అక్రమ భవనాలు తొలగించాలి
- ఆదివాసీ చట్టాలు పట్టవా? స్థానిక ఎమ్మెల్యే మౌనమెందుకు?
- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- 1/70 చట్టం అమలులో నిర్లక్ష్యాన్ని సహించం: - జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్

**తెలుగు గళం వెంకటాపురం(నూగూర్) అక్టోబర్ 19:**

ఐదవ షెడ్యూల్ ప్రాంతమైన భద్రాచలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్ చేశారు. సోమవారం వెంకటాపురం ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో తాటి రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన జీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భద్రాచలం ఐటీడీఏ ఎదుట హెలిప్యాడ్ సమీపంలోని



సర్వే నంబర్ 83లో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపించారు. దీనిపై జీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు సోందె వీరయ్య ఎనిమిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకుని, ఆక్రమణకు పాల్పడిన వారిపై 1/70 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. భద్రాచలం ఐటీడీఏ పీఓపై కఠిన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రభుత్వ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రభుత్వం హైడ్రా తరహాలో చర్యలు చేపట్టాలని, ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడానికి కారణమేంటో స్పష్టం చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోకపోతే జీఎస్పీ ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలు చేపడతామని పూనెం సాయి దొర హెచ్చరించారు. ఈ సమావేశంలో తాటి రాజేష్, తాటి భీమయ్య, లక్ష్మయ్య, రాజు, మహేష్, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న 6వ వార్డ్ మెంబర్ మజ్జిగ రాజు

**తెలుగు గళం న్యూస్ ఐనవోలు /అక్టోబర్ 19**



హన్మకొండ జిల్లా:ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన కుంభం వెంకటయ్య మరణించడంతో,వారి కుటుంబ సభ్యులను 6వ వార్డ్ మెంబర్ మజ్జిగ రాజు పరామర్శించారు.బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించి, బియ్యం అందించి అండగా నిలిచారు.కష్టసమయంలో ఆదుకోవడం ద్వారా మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడెపు స్రవంతి దయాకర్,3వ వార్డ్ మెంబర్ ఉడుత శ్రీకాంత్ యాదవ్, చెంచు రాజు,కద్దూరి శ్రీనివాస్,రాజారావు గణేష్,రాజారావు నిఖిల్,మజ్జిగ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో మహా అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మంత్రి సీతక్క

- భక్తిశ్రద్ధల మధ్య దుర్గామాతకు ప్రత్యేక పూజలు..
- దుర్గామాత సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి..





**తెలుగు గళం ములుగు, అక్టోబర్ 19:**

ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో దుర్గామాత అమ్మవారి విగ్రహం వద్ద నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తనుగుల విజయ్ యాదవ్, తనుగుల నవీన్ యాదవ్ (శ్రీ సాయి డెవలపర్స్) ఆధ్వర్యంలో ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ సాయి డెవలపర్స్ కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ, కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రావణాసురుడు మా దృష్టిలో రాక్షసుడు కాదు.. ఆదివాసీ గోండు వీరుడు!

- ఆదివాసీల పూర్వీకులను అవమానించే రావణ దహనాన్ని నిలిపివేయాలి
- ఆదివాసీ సంస్కృతి, విశ్వాసాలను గౌరవించాలి: --మంగపేట ఆదివాసీ ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

**తెలుగు గళం మంగపేట, ములుగు అక్టోబర్ 19:**

దసరా పండుగ సందర్భంగా రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేసే కార్యక్రమాలను నిలిపివేయాలని మంగపేట మండల ఆదివాసీ ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ గోండు సమాజంలోని కొన్ని సంప్రదాయాల్లో రావణాసురుడిని తమ పూర్వీకుడిగా, గొప్ప రాజుగా, వీరుడిగా గౌరవిస్తారని, అలాంటి వ్యక్తిని రాక్షసుడిగా చిత్రీకరించి దహనం చేయడం తమ మనోభావాలను దెబ్బతీస్తోందని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం ఆదివాసీలు అనేక ప్రాంతాల్లో రాజ్యాలను పరిపాలించి, తమకంటూ ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, పాలనా వ్యవస్థలను అభివృద్ధి చేసుకున్న చరిత్ర ఉందని నాయకులు పేర్కొన్నారు. ఆదివాసీ గోండు సమాజంలోని కొన్ని సంప్రదాయాల్లో రావణుడిని గౌరవనీయమైన వ్యక్తిగా, పూర్వీకుడిగా భావిస్తారని తెలిపారు. తమ విశ్వాసాల ప్రకారం రావణాసురుడు రాక్షసుడు కాదని, గొప్ప రాజు, వీరుడని వారు పేర్కొన్నారు.

**-భిన్నమైన విశ్వాసాలను గౌరవించాలి-**



ఒక సమాజం ఆరాధించే వ్యక్తిని మరో సమాజం ఇతిహాస కథనాల ఆధారంగా ప్రతికూలంగా భావించే పరిస్థితులు ఉన్నప్పుడు, పరస్పర విశ్వాసాలను గౌరవించడం అవసరమని ఆదివాసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పండుగల పేరుతో ఏ సమాజం మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని, ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో దసరా సందర్భంగా రావణ దహన కార్యక్రమాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, రేపు మంగపేట మండలంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో మండలంలోని ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రజాసంఘాల నాయకులు ఎట్టి సారయ్య దొర, తాటి నాగరాజు, తోలేం సుధాకర్, తోలేం రామకృష్ణ, కొమరం రవి, కోరెం మొగిలి, జిగట శ్రీను, సోలం సాయిబాబు, పాయం వికాస్, గుమ్మడి సారయ్య, చందా రమేష్, తోలేం వెంకన్న, ఈసం కృష్ణ, అన్నెబోయిన నరేందర్, సున్నం మధు, పూనెం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీటి ప్రవాహం తగ్గడంతో కళ తప్పిన బొగత జలపాతం

- నిరాశలో పర్యాటకులు!
- సన్నని ధారలకే పరిమితమైన బొగత అందాలు!

**తెలుగు గళం వాజేడు, అక్టోబర్ 19:**



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బొగత జలపాతం నీటి ప్రవాహం తగ్గడంతో వెలవెలబోతోంది. గతంలో గుట్టలపై నుంచి జాలువారే నీటి ధారలతో పర్యాటకులను ఆకట్టుకున్న జలపాతం ప్రస్తుతం నీరు తగ్గిపోవడంతో తన సహజ అందాలను కోల్పోతోంది. గుట్టలపై నుంచి నీరు సన్నని ధారలుగా ప్రవహిస్తుండటంతో జలపాతాన్ని సందర్శించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. బొగత జలపాతం అందాలను ఆస్వాదించాలనే ఆశతో వచ్చిన సందర్శకులకు ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం కనిపించకపోవడంతో నిరుత్సాహం ఎదురవుతోంది. జలపాతంలో నీరు తక్కువగా ఉండటంతో కొందరు పర్యాటకులు సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సరిపెట్టుకుంటున్నారు. రానున్న రోజుల్లో నీటి ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉండటంతో బొగత జలపాతం అందాలు మరింత తగ్గిపోతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**దరఖాస్తుల స్థితిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్**





**తెలుగు గళం ములుగు, అక్టోబర్ 19:**

ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఏ దశలోనూ అలసత్వం వహించవద్దని, తీసుకున్న చర్యలు, దరఖాస్తుల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. సోమవారం ములుగు జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రజావాణి, ప్రజా దర్బార్, గిరిజన దర్బార్‌తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ప్రస్తుత స్థితిగతులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు ఫిర్యాదుదారులకు సకాలంలో సమాచారం అందించాలన్నారు. గత ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కార స్థితిపై ప్రత్యేకంగా సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందున, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి రెండు, ఇతర శాఖలకు సంబంధించి మరో రెండు దరఖాస్తులు కలిపి మొత్తం నాలుగు దరఖాస్తులు అందాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.